క్లుప్తంగా

31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్లో హాల్లో జరుగుతుందని చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి శుక్రవారం తెలిపారు. పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి అంశాల ఆమోదం నిమిత్తం సభ్యుల ముందుంచుతామన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు సమావేశానికి హాజరు కావాలని చైర్‌పర్సన్ ఒక ప్రకటనలో కోరారు.

వాహనాల వేలం ద్వారా రూ.1.44 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంటు సూపరింటెండెంట్ శివరామరాజు తదితరులు

రామచంద్రపురం: అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడ్డ 6 వాహనాలకు వేలం నిర్వహించినట్లు ఎస్ఈబీ సీఐ సీహెచ్ రామకృష్ణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయం వద్ద ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించిన బహిరంగ వేలంలో మొత్తం ఆరు వాహనాలకు ప్రభుత్వ ధర రూ.36,500గా నిర్ణయించగా పాటదారులు రూ. 1,29,000కు పాడుకున్నారన్నారు. జీఎస్టీ రూ.15,480లతో కలిపి ప్రభుత్వానికి రూ.1,44,480 సమకూరిందని సీఐ తెలిపారు. అసిస్టెంట్ ఇన్‌ఫోర్స్‌మెంటు సూపరింటెండెంట్ శివరామరాజు సమక్షంలో జరిగిన ఈ వేలంలో ఎస్సై ఈ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల జిల్లా సలహా బోర్డు సభ్యుడిగా భరత్‌కుమార్

రాయవరం: జిల్లా దివ్యాంగుల సలహా బోర్డు సభ్యుడిగా మండలంలోని వెంటూరుకు చెందిన ఖండవిల్లి భరత్‌కుమార్ నియమించారు. ఈ విషయాన్ని భరత్ కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం– 2016 అనుసరించి ప్రతి జిల్లాకు ఒక సలహా బోర్డును ఏర్పాటు చేశారన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న సలహా మండలిలో తనను నియమిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాలు ఇచ్చారని భరత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

రెండు గ్రామాల్లో పొలంబడి



కందివిత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారి ప్రభాకర్, సర్పంచ్ ఆరిఫ్

కపిలేశ్వరపురం: వరి సాగు పద్ధతులపై రైతులకు అవగాహన అవసరమని ఏవో కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. వెదురుమూడి, టేకి గ్రామాల వ్యవసాయ క్షేత్రాల్లో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఇరు గ్రామాల్లో పొలంబడిని నిర్వహిస్తున్నామన్నారు. ఖరీఫ్ 2023 సీజన్‌కు సంబంధించి పొలంబడి కార్యక్రమంలో రైతుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. నిర్దేశించిన పరిశోధన పొలంలో 15, 30, 45 రోజులకొకసారి భాగస్వామ్య కార్యాచరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జి.హరిబాబు, పొలంబడి గ్రూప్ లీడర్లు కొత్తపల్లి కృపారావు, దామిన బుల్లిరాజు, కామిరెడ్డి రాముడు, కొండిపర్తి పట్టాభి రామయ్య, దాసర వీరేంద్ర చౌదరి, చేకూరి విష్ణు మూర్తి పాల్గొన్నారు.

రాయవరం: పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కె.ప్రభాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని సోమేశ్వరం గ్రామంలో పొలంబడి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పొలంబడి ఉపయోగాలు, బ్యాలెట్ బాక్స్ టెస్ట్ గురించి ఏవో ప్రభాకర్ రైతులకు వివరించారు. అనంతరం పొలంబడి రైతులందరికీ పొలం గట్లపై నాటుకునేందుకు కంది విత్తనాలు అందజేశారు. సర్పంచ్ ఆరిఫ్, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, శాకాఫణి శంకర్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాతపూడి మాజీ సర్పంచ్ కొండయ్య మృతి



కొండయ్య (ఫైల్)

కపిలేశ్వరపురం: తాతపూడి మాజీ సర్పంచ్ కుసుమే కొండయ్య (100) శుక్రవారం వృద్ధాప్యంతో మృతి చెందారు. ఈయన 1995–2001 మధ్య పంచాయతీ సర్పంచ్‌గా సేవలందించారు. ఆయన మృతికి సర్పంచ్ గూటం శ్రావణి, ఎంపీటీసీ సభ్యురాలు జిత్తుక వె వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి శ్రీనివాస్, నాయకులు వాసంశెట్టి సాయిబాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సేవా నిలయాలు

- దేశానికే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ
- అందుబాటులో 35 శాఖలకు చెందిన 500 సేవలు
- మూడున్నరేళ్లలోనే మండపేట అర్బన్, రూరల్‌లో 2.27 లక్షల సమస్యల పరిష్కారం



ద్వారపూడి గ్రామ సచివాలయం

మండపేట: పింఛను కావాలన్నా..రేషన్ కార్డు కావాలన్నా.. ఇంటి పట్టాలు కావాలన్నా.. సమస్య ఏదైనా 72 గంటల్లో పరిష్కారం చూపేది సచివాలయం. అవినీతి, వివక్షతకు తావు లేకుండా 35 శాఖలకు చెందిన 500 రకాల సేవలను సచివాలయంలో అందించడం ద్వారా దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించారు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.

మండపేట పట్టణం, మండలంలోని 37 సచివాలయాల ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేశారు. రెవెన్యూ, శానిటేషన్, తాగునీరు, విద్యుత్తు, వ్యవసాయం, ఆరోగ్యం తదితర శాఖలకు చెందిన 10 నుంచి 11 మందిని నియమించడం ద్వారా 378 మంది యువతకు ప్రభుత్వోద్యోగాలు కల్పించారు. వాటికి అనుబంధంగా తీసుకు వచ్చిన వలంటీర్ వ్యవస్థలో 835 మంది వలంటీర్లుగా పనిచేస్తూ తమ పరిధిలోని 50 కుటుంబాల వారికి ప్రభుత్వ పథకాల లబ్ధిని చెంతకే వెళ్లి అందజేస్తున్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో సొంత వారు సైతం దగ్గరకు రాలేని పరిస్థితుల్లో బాధితులకు బాసటయ్యారు వలంటీర్లు.

మూడున్నరేళ్లలో 2.27 లక్షల సేవలు

గత ప్రభుత్వంలో సమస్యల పరిష్కారానికి, ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ వచ్చాక రికార్డు స్థాయిలో ప్రజలకు సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్ గణాంకాల ప్రకారం 2020 జనవరి 1 నుంచి ఈనెల 27 నాటికి మండపేట పట్టణం, మండల పరిధిలో 2,27,034 సమస్యలు పరిష్కరించడం గమనార్హం. వాటిలో మండపేట పట్టణ పరిధిలో 69,695 సేవలు అందించగా మండల పరిధిలో 1,57,339 సేవలు అందించారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే రికార్డు స్థాయిలో ప్రజలకు సేవలు అందినట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో అసాధ్యం అనుకున్న పనులను సచివాలయ ఉద్యోగులు సుసాధ్యం చేసి చూపిస్తున్నారు. కేవలం అరగంటలోనే మండపేట పట్టణం, మండలంలోని పలు సచివాలయాల ఉద్యోగులు రేషన్ కార్డులు మంజూరు చేయించి ఇచ్చారు.

మండపేట అర్బన్, రూరల్‌లో ఇలా...

మండపేట	టౌన్	రూరల్
సచివాలయాలు	14	23
సచివాలయ ఉద్యోగులు	140	238
వలంటీర్లు	322	513
ఆర్‌బీకేలు	1	23

గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ సిబ్బంది: 04
వైఎస్ జగన్ ప్రభుత్వంలో
వ్యవసాయ శాఖ సిబ్బంది: 24 మంది

గత ప్రభుత్వంలో పంచాయతీలో
ఉద్యోగులు : నలుగురు
వైఎస్ జగన్ ప్రభుత్వంలో
సచివాలయంలో ఉద్యోగులు : 11 మంది

సేవలు సులభతరం



అన్ని శాఖల కార్యకలాపాలకు సచివాలయం కేంద్ర బిందువుగా ఉంది. ఏ సమస్య అయినా సచివాలయానికి వెళితే సకాలంలో పరిష్కారమవుతుంది. గ్రామ జనాభాను బట్టి సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు సేవలు సులభతరంగా అందుతున్నాయి.
– గారపాటి సౌజన్య, సర్పంచ్, మెర్నిపాడు

ఆదర్శంగా తీర్చిదిద్దారు



మూడు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశాను. గతానికి, ఇప్పటి సచివాలయ వ్యవస్థకి ఎంతో తేడా ఉంది. సీఎం జగన్మోహన్‌రెడ్డి వచ్చాక సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.
– దూలం ఆనందరావు, మాజీ సర్పంచ్, కేశవరం

కాలయాపన లేదు



గతంలో పనిని బట్టి ఆయా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని సేవలు సచివాలయంలోనే అందిస్తుండటంతో వ్యయ ప్రయాసలు తొలగిపోయాయి. నిర్ణీత వ్యవధిలోనే పని పూర్తిచేయడం వలన కాలయాపన ఉండడం లేదు.
– తోరం శ్రీనివాస్, జెడ్.మేడపాడు

కాకినాడ వెళ్లి పింఛను ఇచ్చాను



జగనన్న వచ్చాక వలంటీర్‌గా సేవచేసే అవకాశం కలిగింది. ద్వారపూడిలోని నా పరిధిలో ధనరాజు పింఛను తీసుకోక పోవడంతో వాకబు చేయగా అనారోగ్యంతో కాకినాడలో ఉన్నారని తెలిసింది. ఆయన వద్దకు వెళ్లి పింఛన్ అందజేయడం ఆనందాన్నిచ్చింది.
– కొండేపూడి వినుపుప్ప, వలంటీర్, ద్వారపూడి

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం



శలపాకలో జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి వేణు



కోటిపల్లిలో లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతుందని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం శలపాకలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ పేదరికంపై విజయం సాధించడానికి సీఎం జగనన్న నవరత్నాల పథకాలనే ఆయుధాలు అందిస్తున్నారన్నారు. జగనన్న పాలనలో కుల, మత, పార్టీల భేదం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, ఏ కారణం చేతనైనా పథకాలు అందకుండా మిగిలిపోయినవారు ఉంటే వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమన్నారు. తహసీల్దార్ సాయిసత్యనారాయణ మాట్లాడుతూ శలపాకలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల ధ్రువీకరణ పత్రాలు 502, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 483, పంటల సాగు హక్కుపత్రాలు 14, హౌస్ హోల్డ్ మాపింగ్ విభజన మూడు, రైస్ కార్డు ఒకటి మంజూరు చేశామన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, మండల పార్టీ బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు ఎంపీటీసీ సభ్యుడ దడాల రమేష్, పీఏసీఎస్ చైర్మన్లు పి.సుబ్రహ్మణ్యం, శ్రీరామారెడ్డి, కురుపూడి సూర్యనారాయణ, టేకుమూడి దుర్గారావు, పోతురాజు బాబురావు, యాళ్ల సత్తిబాబు, ఆర్ఎంసీ డైరెక్టర్లు ఈశ్వర రెడ్డి, బాను పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండల పరిధిలోని కోటిపల్లిలో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. సర్పంచ్ పెమ్మాడి బేబి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా పొందవచ్చన్నారు. గతంలో మాదిరి కావల్సిన ధ్రువపత్రాల కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని దీని భాగంగానే జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఓబులనేని శ్రీవరలక్ష్మీ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పులు మసేను వెంకన్న(రేవు శ్రీను), వైఎస్సార్ సీపీ నాయకులు ఓబులనేని రాజ్ కుమార్, పెమ్మాడి సత్తిబాబు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన పాలన

- మంత్రి వేణు
- యనమదలలో గడప గడపకూ మన ప్రభుత్వం



యనమదలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెరుగైన పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను నెలకొల్పారని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని యనమదలలో శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి వివరాలు, పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా సొమ్ము జమ చేస్తోందని చెప్పారు. రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, నాడు నేడు, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, గోరుముద్ద, ఆసరా, చేయూత లాంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి వివరించారు. సర్పంచ్ పంపన వీరవెంటరమణ, ఎంపీటీసీ సభ్యుడు నురుకుర్తి శ్రీరామకృష్ణ, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ పిల్లి బాల సుబ్రహ్మణ్యం మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కుక్కల గోవిందు, గ్రామ పెద్దలు కంటిపూడి కృష్ణ, ఎంపీడీవో ఎన్ సెలత్‌రాజు, ఆర్ఐ పెంకే ముని, ఏపీవో అరుణకుమారి పాల్గొన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

- చైర్‌పర్సన్ శ్రీదేవి
- కౌన్సిల్ సమావేశంలో 10 అంశాలకు ఆమోదం




కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: మున్సిపాలిటీలో 28వార్డుల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు వేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో శుక్రవారం సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. 11 అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. మొదటి అంశమైన 6వవార్డు కౌన్సిలర్ మేడిశెట్టి వెంకటలక్ష్మి రాజీనామాను తిరస్కరిస్తున్నట్లు చైర్ పర్సన్ శ్రీదేవి వెల్లడించారు. మిగిలిన 10 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలోని 28వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్లను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అనంతరం కౌన్సిలర్ కేతా సుజాత మాట్లాడుతూ టిడ్కో గృహాలను త్వరితగతిని అందించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి విడత టిడ్కో గృహాలను ఇప్పటికే అందజేశామని, రెండవ విడత గృహాలు నిర్మాణంలో ఉన్నాయని, రెండు మూడు నెలల్లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరావు, డీఈ డి.దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి

- లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు
- సేవలందిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం



అద్దంకివారిలంకలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిణి కృష్ణకుమారి

కపిలేశ్వరపురం: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం మండలంలోని కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలు ముంపుబారిన పడ్డాయి. వరద చర్యల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కృష్ణకుమారి ఆయా గ్రామాల్లో పర్యటించారు. వరద మరింత పెరిగితే నివాస ప్రాంతాల్లోకి వరదనీరు చేరుకునే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం పునరావాస చర్యలను చేపట్టింది. వాటిని తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్.నరసింహారావు, వీఆర్వో స్వామినాయుడు, టి.వెంకటేశ్వరరావులు పర్యవేక్షిస్తున్నారు.

పునరావాస కేంద్రానికి తరలించే బాధ్యతలిలా...

697 గృహాల్లో 2,098 మంది ప్రజలున్న కేదారిలంకకి కార్యదర్శి డి.శ్రీనివాసరావు, వీఆర్వో టి.వెంకటేశ్వరరావులను కేటాయించారు. వారిని పీఆర్ జేఈ డి.రాఘవులు పర్యవేక్షిస్తారు. వీధివారిలంకలో 686 గృహాల్లో 1,974 మంది నివసిస్తుండగా వారికి రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాగ్యరాజ్ పర్యవేక్షణలో కార్యదర్శి పి.మోహన్, వీఆర్వో ఎ.మల్లేశ్వరరావు విధులు నిర్వహిస్తారు. నారాయణలంకలో 286 ఇళ్లల్లో ఉన్న 600 మందికి ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్ పర్యవేక్షణలో కార్యదర్శి కె.రవితేజ, వీఆర్వో వి.ప్రసాదరావు విధులు నిర్వహిస్తారు. అద్దంకివారిలంకలో 657 గృహాల్లో 1,628 ఉండగా హౌసింగ్ ఏఈ పీవీవీసత్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో కార్యదర్శి సీహెచ్.నరసింహారావు, వీఆర్వో కె.స్వామినాయుడు చూస్తారు. పల్లపులంకలో 252 నివాసాల్లోని 981 మందికి ఏపీఎం జి.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలోని కార్యదర్శి కె.శంకర్‌మూర్తి, వీఆర్వో సాకా సత్యనారాయణ వి.ధులు నిర్వహిస్తారు.


అధికారులకు వసతులు కల్పించే బాధ్యతలిలా...

కేదారిలంక, వీధివారిలంక గ్రామాల ప్రజలకు కొత్తపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేశారు. వీఆర్వోలు ఉమా మహేశ్వరరావు, వై.రాజారత్నం పర్యవేక్షణలో వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆర్.దివాకర్, ఎస్.సతీష్‌కుమార్, వీఏఏలు ఎండీ జగదీష్, ఎస్.రఘువర్మ బాధ్యలను నిర్వహిస్తారు. నారాయణలంక ప్రజలకు వాడపాలెంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను కేటాయించారు. అక్కడ వీఆర్వో షేక్ అబ్దుల్ కరీం పర్యవేక్షణలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లు వి.సుబ్బారావు, కె.ఆంజనేయులు, వీఏఏలు పి.సతీష్, ఐ.సందీప్‌కుమార్ బాధ్యతలను చూస్తారు. అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల ప్రజలకు వానపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను కేటాయించారు. అక్కడ వీఆర్వోలు టి.రాంబాబు, ఎస్‌వీవీ ప్రసాద్ పర్యవేక్షణలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు ఐ.ఇమ్మానుయేలు, ఎ.దర్గారావు, వీఏఏలు బీఎస్ నాగేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్‌లు బాధ్యతలను నిర్వహిస్తారు.

పశువుల తరలింపు ఈ విధంగా..

కేదారిలంకలో 309, వీధివారిలంకలో 188, నారాయణలంకలో 283 మొత్తం 780 పశువులుండగా వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించే బాధ్యతలను ఉద్యాన సహాయకులు పి.శ్యామ్, బి.నాని, ఒక పోలీస్ కానిస్టేబుల్‌కు అప్పగించారు. అద్దంకివారిలంకలో 417, పల్లపులంకలో 424, కోరుమిల్లిలంకలో 202 మొత్తం 1,043 పశువులుండగా వాటిని తరలించే బాధ్యతలను ఉద్యాన సహాయకులు సుబ్రహ్మణ్యం, ఎం.వెంకటరమణ, ఒక పోలీస్ కానిస్టేబుల్‌లకు అప్పగించారు. మొత్తం ఐదు లంక గ్రామాల్లోని 1,823 పశువులను రక్షించనున్నారు.

పరవళ్లు తొక్కుతూ..



కోటిపల్లి రేవులోని పంటు ఎక్కే రహదారిలో భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు



కుమ్మరి సావరం వద్ద బలహీనంగా ఉన్న గట్టు వద్ద ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు, కర్రలు

కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సముద్రంలో కలిసేందుకు ఉరకలు వేస్తూ పరవళ్లు తొక్కుతోంది. ఒక్కసారిగా గోదావరికి వరద పెరగడంతో లంకలోనే పశువులు ఉండిపోయాయి. దీంతో ఉదయం పంటుని ఏర్పాటు చేసి లంకల్లో ఉన్న పశువులను రైతులు గట్టుకు చేరుస్తున్నారు. గోదావరి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో కోటిపల్లి–ముక్తేశ్వరం పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. రేవుదాటిన తరువాత ముక్తేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన కంకర రోడ్డు గోదావరిలో కొట్టుకుపోయింది. దీంతో పాటు ఎన్నడూ లేని విధంగా రెండు తూరలు కూడా కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణానికి ఆటంకం కలిగింది.

రెండు అడుగులు పెరిగితే నీటమునగనున్న మత్స్యకార కాలనీ

గ్రామంలోని మాధవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట మూడు వీధులు వరద నీరు చుట్టుముట్టింది. గోదావరి ఒడ్డునే ఉన్న పాకలలోనికి వరదనీరు వచ్చి చేరింది. గోదావరిలో ఉండే నాటు పడవలు ఇళ్లముందుకు వచ్చి చేరాయి. కోటిపల్లి వద్ద గల కుమ్మరిసావరం, సుందరపల్లి వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉంది. పీడబ్ల్యూడీ అధికారులు ఇసుక బస్తాలు, కర్రలతో గట్టును పటిష్టం చేసి గస్తీని ఏర్పాటు చేశారు.

ద్రాక్షారామలో మజిలీస్‌లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలోని పంజాలలో ముస్లిం భక్తులు మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 10వ రోజు శుక్రవారం ఉత్తరప్రదేశ్ లక్నో నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా మహ్మద్ షంసి ఆధ్వర్యంలో శోకతప్త హృదయాలతో మజిలీస్‌లు ఆలపించారు. ఆగా వారి పెద్ద పంజా, ఆజాఖానా జెహరా, పంజతని పంజాలను రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మితో కలసి సందర్శించారు. బార్ ఇమామ్‌ను దర్శించారు. ధర్మకర్తలు ఆగా హీరా బేగం, ఆగా అలీ రజా, ఆగా అబ్దుల్ ఘనీ, మీర్జా అలీహుస్సేన్, మీర్జా సజ్జాద్ హుస్సేన్, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి జాఫర్ హుస్సేన్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పి.బుచ్చిరాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కొబ్బరి మొక్కలు



వెంటూరులో మొక్క నాటుతున్న పృథ్వీరాజ్

రాయవరం: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని కుర్మాపురం, వెంటూరు పంచాయతీల్లో శుక్రవారం కొబ్బరి మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమృత్ సరోవర్ చెరువు గట్లపై వాటిని నాటారు. వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్, మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నున్న ప్రదీప్‌కృష్ణ, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు వాసంశెట్టి విజయకుమార్, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి హాజరయ్యారు.

కేశవరంలో..

మండపేట: ఉపాధి హామీ పథకం కింద మండలంలోని కేశవరం గ్రామంలో 200 కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓ సుబ్బారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ పోతురాజు, సీహెచ్ భద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంపై అవగాహన

కాజులూరు: నానో యూరియా వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పొలంలో అడుగు లోతుకు పైబడి వానపాములు వంటి జీవులు జీవిస్తాయన్నారు. ఇవి భూసారం పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. పొలాల్లో యూరియా అధికంగా వేయటం ద్వారా రైతు నేస్తాలుగా పిలుచుకునే ఈ వానపాములు నశిస్తున్నాయన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి దాని స్థానంలో నానో యూరియాను వినియోగించుకోవచ్చునన్నారు. ద్రవ రూపంలో ఉండే నానో యూరియా బాటిల్ ధర రూ.225 వరకూ ఉంటుందని, ఇది ఒక బస్తా సాధారణ యూరియాతో సమానమన్నారు. వీఏఏ శిరీషా, వనుం శ్రీరమ్య, రైతులు పాల్గొన్నారు.

ఫీల్డ్ లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక

కె.గంగవరం: మండల పరిధిలోని కోట గ్రామంలో శుక్రవారం ఫీల్డ్ లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక జరిగింది. సొసైటీలోని సభ్యులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఎన్నిక విధానంలో సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొద్దూరు శేషాద్రి, ఉపాధ్యక్షులుగా చల్లపల్లి అమ్మన్న, కార్యదర్శిగా కూర్మా రాజు, నంబర్లుగా మల్లిడి జార్జి, దాకే గోవింద్, జనిపెళ్ళ వీరప్రసాద్, నీతిపూడి బ్రహ్మాజీ ఎన్నికయ్యారు.

మణిపూర్ ఘటనపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కమిటీ నాయకులు

కె.గంగవరం: మణిపూర్ ఘటన యావత్ భారతీయులను ఉలిక్కి పడేలా చేసిందని మండల గ్రామిక మహిళా సమన్వయ కమిటీ నాయకులు ఎం.దుర్గమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం అన్నారు. మండల పరిధిలోని కె.గంగవరంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అంగన్‌వాడీ సిబ్బంది, సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సూర్యకుమారి, వెంకటరత్నం, శ్రీదేవి, వీరవేణి పాల్గొన్నారు.

పనుల జాప్యంతో ఇక్కట్లు

మండపేట: ద్వారపూడి రోడ్డు అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరితగతిన రోడ్డు అభివృద్ధి పనులు పూర్తిచేయకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని ఎమ్మెల్యే వేగుళ్ల పేర్కొన్నారు.

రామచంద్రపురం నుంచే పోటీ

రామచంద్రపురం: వచ్చే ఎన్నికల్లో తాను రామచంద్రపురం నుంచే పోటీ చేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జనసేన, టీడీపీ పొత్తు ఉంటే పొత్తుకు అనుగుణంగా నడుచుకుంటానన్నారు.